తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

శనివారం
21 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :



పల్లెలకూ పాకుతున్న గంజాయి మహమ్మారి!

గ్రామీణ ప్రాంతాల్లోనూ గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ సరఫరాను అరికట్టాల్సిన అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల విక్రయాలు జరిగితే సమాజ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాల్సిన యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంతో పాటు సమాజంపై కూడా ఉంది. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామస్థాయిలోనే వాటి వినియోగాన్ని నిరోధించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చింతకాని , జనంసాకి...

- యువత భవిష్యత్తుకు ముప్పు..
- నిర్మూలనకు పటిష్ట కార్యాచరణ ఏదీ?
- అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలి..
- గ్రామగ్రామాన అవగాహన కల్పించాలి
- మత్తుకు బానిసవుతున్న యువతను కాపాడుకోవాలి..
- పోలీస్ శాఖ మరింత అప్రమత్తం కావాలి





గంజాయి రహిత గ్రామాలే ధ్యేయం

యువత భవిష్యత్తే లక్ష్యం

సబ్-ఇన్‌స్పెక్టర్ జ.నరేష్

గ్రామాల్లో గంజాయి మహమ్మారి ని పూర్తిస్థాయిలో నిర్మూలించేందు కు పోలీస్ శాఖ ప్రత్యేక కార్యా చరణతో ముందుకు సాగుతోందని సబ్- ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు.

మిగతా 2లో



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ

వార్తా లోపలి పేజీలో

హత్య కేసులో నిందితుడికి రెండు జీవిత ఖైదులు

రూ.10 వేల జరిమానా.. నల్లగొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు:ఎస్పీ.శరత్ చంద్ర పవార్

నల్లగొండ ప్రతినిధి,నవంబర్ 20,(జనంసాక్షి): హత్య కేసులో నిందితుడికి డబుల్ జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక

మిగతా 2లో



రైతుల సంక్షేమమే లక్ష్యంగా నూతన పాలకవర్గం పనిచేయాలి : ఎమ్మెల్యే



2లో

కారు వెళ్లని మార్గంలో బైక్‌పై స్వయంగా కలెక్టర్ పర్యటన



భూ రీ సర్వే పనుల పురోగతి పై స్వయంగా ఆరా రైతులను భాగస్వాములను చేసి సర్వే పూర్తి చేయాలని సూచన

నూతనకల్ నవంబర్ 20(జనంసాక్షి)

క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని తెలుసుకోవడంపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పనులను స్వయంగా పరిశీలించాలన్న లక్ష్యంతో అవసరమైతే ప్రయాణ మార్గంలోని ఇబ్బందులను సైతం అధిగమిస్తున్నారు. శుక్రవారం నూతనకల్ మండలం దిర్శనపల్లి గ్రామ పర్యటనలో కలెక్టర్ వ్యవహరించిన తీరు ఇందుకు నిదర్శనంగా నిలిచింది. గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ భీమా యోజన పథకాన్ని ప్రారంభించిన అనంతరం అదే గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ భూముల రీ సర్వే పనులను పరిశీలించేందుకు కలెక్టర్ వెళ్లారు. అయితే సర్వే ప్రాంతానికి వెళ్లే మార్గంలో కారు వెళ్లేందుకు వీలులేకపోవడంతో అక్కడే ఉన్న ద్విచక్రవాహనంపై తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి సర్వే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 1,240 ఎకరాల భూమికి గాను ఇప్పటివరకు 800 ఎకరాల్లో రీ సర్వే పూర్తయినట్లు తహసీల్దార్ కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రీ సర్వే ప్రక్రియలో రైతులను భాగస్వాములను చేయాలని, వారి సహకారంతో సర్వే నిర్వహిస్తే పనులు మరింత వేగంగా పూర్తవుతాయని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎంఏ భారతి, ఎంపీడీవో సునీత, వ్యవసాయ అధికారి సైదా నాయక్, సర్వేయర్లు, ఆర్ ఐ హసన్ అలీ, జిపిఓలు, సర్పంచ్ పాండవుల లింగయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

పల్లెలకూ పాకుతున్న గంజాయి మహమ్మారి!

యువత జీవితాలతో చెలగాటం:
యువతలో కొందరు స్నేహితుల ప్రలోభాలకు లోనై, సరదా కోసం ప్రయత్నించి లేదా ఇతరుల ప్రభావంతో గంజాయి వినియోగానికి అలవాటుపడే ప్రమాదం ఉంది. తొలుత అలవాటుగా ప్రారంభమైన ఈ వ్యవహారం క్రమంగా వ్యసనంగా మారితే చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం దెబ్బతినే అవకాశముంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణయ సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. యువతలో మత్తు పదార్థాల వినియోగం పెరిగితే వ్యక్తిగత జీవితాలకే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా దుష్ప్రభావం పడే ప్రమాదం ఉంది.

పల్లెల్లోనూ పోలీసుల నిఘా పెంచాలి:
గంజాయి అక్రమ రవాణాను పట్టణాలకే పరిమితమైన సమస్యగా భావించకుండా గ్రామీణ ప్రాంతాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమ విక్రయాలపై సమాచారం సేకరించి, వాస్తవాలను నిర్ధారించి చట్టప్రకారం చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరాకు అవకాశం లేకుండా నిరోధక చర్యలు చేపట్టాలి. గ్రామస్థాయిలో పోలీసుల నిఘా వ్యవస్థను బలోపేతం చేసి, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న మూలాలను గుర్తించాలి.

సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి:
గంజాయి నిర్మూలనలో భాగంగా కేవలం చిన్నస్థాయి విక్రేతలను పట్టుకోవడంతోనే సరిపెట్టకుండా, అక్రమ సరఫరా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులు, ముఠాలను గుర్తించాలి. గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరికి సరఫరా అవుతోంది? యువతకు ఎలా చేరుతోంది? అనే అంశాలపై ఆధారాలతో సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తరలిస్తున్న వ్యక్తులు, అక్రమ నిల్వలు, విక్రయ నెట్‌వర్క్‌లపై సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూనే, అమాయకులను అనుమానాల ఆధారంగా వేధించకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలి.

అవగాహన కార్యక్రమాలతోనే శాశ్వత పరిష్కారం:
గంజాయి నిర్మూలనకు పోలీసుల దాడులు, అరెస్టులతో పాటు నిరంతర అవగాహన కార్యక్రమాలు కూడా అవసరం. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి గంజాయి వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక నష్టాలను ప్రజలకు వివరించాలి. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులకు మత్తు పదార్థాల ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

వ్యసనానికి గురైన యువతకు వైద్య సహాయం:
గంజాయి వినియోగానికి అలవాటుపడిన యువతను కేవలం నేరస్థులుగా ముద్రవేయడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. వారి పరిస్థితిని అంచనా వేసి అవసరమైన వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్, వ్యసన విముక్తి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు సమన్వయంతో పనిచేస్తే యువత తిరిగి సాధారణ జీవితంలోకి రావడానికి అవకాశం ఉంటుంది. అక్రమ సరఫరాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూనే, వ్యసన బాధితులకు తగిన సహాయం అందించడంపై కూడా దృష్టి సారించాలి.

తల్లిదండ్రుల పర్యవేక్షణ కీలకం:
పిల్లల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా వారితో మాట్లాడాలి. స్నేహితుల ఒత్తిడి, మానసిక సమస్యలు, ఇతర కారణాల వల్ల వారు మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారా అనే విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అనుమానాల ఆధారంగా నిందించకుండా, సమస్య ఉంటే నిపుణుల సహాయం తీసుకోవాలి. పిల్లలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ వారి భవిష్యత్తుపై దృష్టి సారించాలి.

యువతే సామాజిక మార్పునకు చోదకశక్తి:
దేశ భవిష్యత్తుకు యువతే పునాది. అలాంటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. గ్రామాల్లో యువజన సంఘాలు, క్రీడా మండళ్లు, విద్యార్థి సంఘాలు మత్తు వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టాలి. గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలను తమ తోటి యువతకు వివరించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలి. యువతలో ఉన్న శక్తిని సద్వినియోగం చేస్తే గ్రామాల అభివృద్ధికి మరింత దోహదపడుతుంది.

పోలీసులు-ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలి:
గంజాయి నిర్మూలనను ఒక శాఖ బాధ్యతగా కాకుండా సామాజిక ఉద్యమంగా చేపట్టాలి. పోలీస్ శాఖ, ఎక్సైజ్ విభాగం, విద్యాశాఖ, వైద్యశాఖ, కార్యాచరణ రూపొందించాలి. . అక్రమ సరఫరాపై నిరంతర నిఘా, విద్యాసంస్థల్లో అవగాహన, కొనసాగినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి.

మత్తురహిత సమాజ నిర్మాణమే లక్ష్యం:
యువత జీవితాలను అంధకారంలోకి నెట్టే గంజాయి మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం మరింత చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉంది. గ్రామగ్రామాన అవగాహన పెంపొందిస్తూ, అక్రమ సరఫరా మూలాలను ఛేదిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో మత్తు పదార్థాలపై పోరాటాన్ని బలోపేతం చేయాలి.

గంజాయి రహిత గ్రామాలే ధ్యేయం.. యువత భవిష్యత్తే
లక్ష్యం: సబ్-ఇన్‌స్పెక్టర్ జి.నరేష్
గంజాయి వినియోగం, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములై, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని, నేరాల నియంత్రణకు పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ కోరారు.

హత్య కేసులో నిందితుడికి రెండు జీవిత ఖైదులు

న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన షేక్ సిరాజ్ అలియాస్ సిల్లు (40)కు రెండు జీవిత ఖైదులతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. 2025 ఆగస్టు 27న నల్లగొండలోని డీవీకే రోడ్డులో నిద్రించే స్థలం విషయంలో చింతకింది రమేష్ (40)తో జరిగిన వివాదంలో సిరాజ్ బండరాయితో తలపై కొట్టి హత్య చేశాడు. ఈ కేసులో సీసీటీవీ ఫుటేజ్ కీలక ఆధారంగా మారింది. పోలీసుల సమగ్ర దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో బీఎన్ఎస్ 103(1), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం 3(2)(ఐఏ) కింద న్యాయస్థానం శిక్ష విధించింది. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతిని పరామర్శించిన ఎం ఎల్ ఏ రాగమయి

పెనుబల్లి, నవంబర్ 20(జనంసాక్షి)
సత్తుపల్లి ఎం ఎల్ ఏ శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతని పరామర్శించారు, పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన గరిడేపల్లి ఆకాంక్ష ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఖమ్మం నిమ్స్ ఆసుపత్రిలో ఆమెకు ఆపరేషన్ నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఎం ఎల్ ఏ రాగమయి ఆమె నివాసానికి వెళ్లి ఆకాంక్షను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. ఎం ఎల్ ఏ వెంట సత్తుపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, సర్పంచ్ నారుమాళ్ల వెంకటేశ్వరరావు, బుక్కా కృష్ణవేణి, నల్లమోతు సునీల తదితరులు ఉన్నారు.



రైతుల సంక్షేమమే లక్ష్యంగా నూతన పాలకవర్గం పనిచేయాలి : ఎమ్మెల్యే

○ బూర్గంపహాడ్ మార్కెట్ యార్డు అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి:ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపహాడ్ నవంబర్ 20 (జనంసాక్షి)
రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ బూర్గంపాడు మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు మార్కెట్ యార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ తోలెం కళ్యాణి, వైస్ చైర్మన్ కాకా రాములు, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేయాలని, మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని



అన్నారు. మార్కెట్ కార్యకలాపాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నూతన పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు పరస్పర సమన్వయంతో బూర్గంపాడు మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. నూతన పాలకవర్గంలో డైరెక్టర్లుగా లోడిగ సత్యనారాయణ, పాల్వంచ శ్రీను, యెనిక మంగమ్మ, సోడే వెంకటేశ్వర్లు, ధరావత్ లలిత, యడుల్ల యేసు, పునెం శ్యామ్ కుమారి, గొగ్గెల రవి, భూక్య సేవాలాల్, మడకం నాగమణి బాధ్యతలు స్వీకరించారు. ట్రేడర్ ప్రతినిధులుగా తాటి మౌనిక, తెల్లం వీరభద్రం నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ బూర్గంపహాడ్ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఏడు మండలాల అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రత్యేక కౌంటర్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 20 (జనం సాక్షి)
అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం వర్తించేలా చూడాలి . అధికారులకు ఆదేశాలుఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటర్లలో విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారు ఏ ప్రాంతం నుంచి వచ్చారు, దరఖాస్తుకు అవసరమైన రేషన్ కార్డులను వెంట తీసుకువచ్చారా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన వారందరికీ రేషన్ కార్డులు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. రేషన్ కార్డు కలిగిన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తించేలా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరూ పథకానికి దూరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ ఆఫీసర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఆదివాసీ కుటుంబాలందరికీ జాబ్ కార్డులు అందించాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు చేయాలి

- విద్యార్థులకు వారధి పుస్తకంలోని అంశాలపై పట్టు సాధించేలా బోధించాలి- ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం నవంబర్ 20 (జనంసాక్షి)

మారుమూల ఆదివాసీ గ్రామాల్లోని ప్రతి అర్హ కుటుంబానికి జాబ్ కార్డు అందించి, ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. గిరిజన రైతులు తమ పంట పొలాల్లో గట్లు ఏర్పాటు చేసుకోవడం, ఫామ్‌పాండ్లు నిర్మించుకోవడం వంటి పనులను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో నమోదు చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం దుమ్ముగూడెం మండలంలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. గిరిజన రైతుల పంట పొలాల్లో పర్యటిస్తూ వీబీ రామ్‌జీ పథకం ద్వారా చేపడుతున్న పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేశారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనుల వివరాలు, కూలీల హాజరు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు, వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక కింద గుర్తించిన పనులు, కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కమలాపురం గ్రామానికి చెందిన కోరం రాజేష్ పంట పొలంలో నిర్మిస్తున్న ఫామ్‌పాండ్‌ను, ఎంపీపీ పాఠశాలకు వెళ్లే ఫారెస్టేషన్ రోడ్డు, ట్రైన్ ఎండ్ సోఫిట్ నిర్మాణ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.



- వారధి పుస్తకంపై విద్యార్థులకు పట్టు సాధించాలి.

అనంతరం ఆర్లగూడెంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులతో కలిసి కూర్చొని వారధి పుస్తకంలోని ఆంగ్లం, గణిత అంశాలపై వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల ప్రగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ వారధి పుస్తకంలోని అంశాలను, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పాఠ్యాంశాలను తప్పనిసరిగా బోధించాలని ఆదేశించారు. విద్యార్థులకు బోధించే సమయంలో వారి స్పందన, అభ్యసన సామర్థ్యాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎస్సీఈఆర్పీలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ వారధి పుస్తకంలోని అంశాలను బోధిస్తున్నారా లేదా అన్నది క్రమం తప్పకుండా పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎంపీడీవో వివేక్ రామ్, ఏవో నవీన్ కుమార్, ఈజీఎస్ ఏపీవో సుకన్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ టి.ఏ.వెంకటేష్, ఎఫ్ఏ వెంకటేష్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్, ఎస్సీఆర్పీలు విటల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలకు

ఇందిరమ్మ ఇళ్లతో భరోసా

ఏదులాపురం 29వ వార్డులో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మం రూరల్, నవంబర్ 20(జనంసాక్షి):

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల్లో ఆనందం నింపుతోంది. సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో ఆశలు నిజమవుతున్నాయి. ఇందులో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ 29వ వార్డుకు చెందిన బుద్ధి ఉమా ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇంటి పట్టా పొందిన ఉమా, గురువారం కుటుంబ సభ్యులు, స్థానికుల సమక్షంలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి వెంపటి రవి, వెంపటి వెంకటేశ్వర్లు, అక్కినేపల్లి దేవయ్యచారి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంతింటి భద్రత కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

ఆత్మీయుల సమక్షంలో అంగరంగ వైభవంగా ధరావత్ చందు నాయక్ తనయ వివాహం!

- రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధుల సందడి..

నూతన వధూవరులకు ఆశీర్వచనాలు

బూర్గంపహాడ్ నవంబర్ 20 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్, విజయలక్ష్మి దంపతుల జ్యేష్ఠ కుమార్తె డాక్టర్ వసుంధర, డాక్టర్ అరవింద్‌ల వివాహ మహోత్సవం భద్రాచలంలోని శ్రీ సీతారామ కన్వెన్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, గ్రామస్తులు, బంధుమిత్రుల సమక్షంలో వివాహ వేడుక వైభవంగా సాగింది. డాక్టర్ వసుంధర (ఎంబీబీఎస్, ఎంఎస్), డాక్టర్ అరవింద్ (ఎంబీబీఎస్, ఎండీ జనరల్ మెడిసిన్) వివాహ బంధంతో ఒక్కటైన శుభవేళ పలువురు ప్రముఖులు వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా ఆహ్వానించిన చందు నాయక్‌వివాహ వేడుకను పురస్కరించుకొని సారపాక గ్రామ ప్రజలందరికీ స్వయంగా వివాహ ఆహ్వాన పత్రికలు అందజేసి వేడుకకు ఆహ్వానించడం ద్వారా ధరావత్ చందు నాయక్ తన ఆత్మీయతను చాటుకున్నారు. ఆయన ఆహ్వానంతో సారపాక ప్రాంతానికి చెందిన స్థానికులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

- ప్రముఖుల రాకతో సందడి

ఈ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలతతో పాటు పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యారు. రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆత్మీయులు, బంధుమిత్రుల రాకతో శ్రీ సీతారామ కన్వెన్షన్ హాల్ సందడిగా మారింది. కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాలు, అతిథుల అభినందనలు, పెద్దల ఆశీర్వచనాల నడుమ వివాహ మహోత్సవం కన్నులపండువగా జరిగింది.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన

అర్హులైన కుటుంబాలకు రూ.5 టేకులపల్లి

టేకులపల్లి, నవంబర్ 20(జనంసాక్షి):



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై జిల్లా అదరపు కలెక్టర్ వేణుగోపాల్ అవగాహన కల్పించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై మండలంలోని శుక్రవారం 16 గ్రామపంచాయతీలలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెసి తోపాటు తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి పాల్గొని పథకం వివరాలను వివరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బీమా ప్రీమియం మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు.ఈ పథకానికి సంబంధించిన ప్రక్రియకు నెల రోజుల గడువు ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలవడమే పథకం లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా మారిన దారి..

బీటీ రోడ్డు కోసం ప్రజల ఎదురుచూపులు



కామేపల్లి, నవంబర్ 19 (జనం సాక్షి):

కామేపల్లి మండలం రుక్మితండా గ్రామ పంచాయతీ పరిధిలోని బండిపాడు గ్రామం నుండి రఘునాథపాలెం మండలం జీకే బంజర వరకు సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు,రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డోర్నకల్ వెళ్లేందుకు ఈ మార్గమే ప్రధాన ఆధారం కావడంతో,నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఈ మట్టిదారి నరకప్రాయంగా మారింది.దీనికి తోడు మార్గమధ్యలో ఉన్న బ్రిటిష్ కాలం నాటి ఇరుకు వంతెన మీదుగా ప్రయాణించడం వాహనదారులకు, రైతులకు ప్రమాదకరంగా మారి తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది.ఈ రహదారిని బీటీ రోడ్డుగా నిర్మిస్తే జీకే బంజర, బండిపాడు గ్రామాలతో పాటు డోర్నకల్, పండితాపురం, పాపటపల్లి గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వెలుగుమట్ల బాధితులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 20 (జనం సాక్షి)



వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితులందరికీ ఎలాంటి షరతులు లేకుండా అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు . శుక్రవారం ఆయన వెలుగుమట్లను సందర్శించి , కేతవరపు కృష్ణారావు అధ్యక్షతన కలెక్టర్ వైఖరిని నిరసిస్తూ నిర్వహించిన సభలో మాట్లాడారు . ప్రభుత్వం 729 మంది పేదల ఇళ్లను కూల్చివేసినట్లు ప్రకటించి , కేవలం 300 మందికే ఇళ్లు నిర్మిస్తామనడం సరికాదన్నారు . బీసీ , ఎస్సీ , ఎస్టీ జేఏసీల సుదీర్ఘ పోరాటం ఫలితంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మిగిలిన అర్హులకు కూడా వెలుగుమట్లలోనే ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు . ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ నెల 29లోగా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు . భూదాన్ భూములు పేదలకే చెందాలని , అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు లేదా ఇతర నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు . బాధితుల గ్రామాల్లో చిన్నపాటి ఇళ్ల స్థలాలు ఉన్నాయనే కారణంతో వారిని అనర్హులుగా ప్రకటించవద్దని కలెక్టర్‌ను కోరారు . డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 29న రాహుల్ ఇల్లు ముట్టడి కార్యక్రమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు . బీసీ , ఎస్సీ , ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పోడకంటి రాంబాబు మాట్లాడుతూ 15 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను కూల్చివేసి , ఇప్పుడు వారినే అనర్హులుగా ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు . బాధితులే నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి గుర్తించిన అర్హులందరికీ ఎలాంటి షరతులు లేకుండా వెలుగుమట్లలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు . లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని మరో ఉద్యమం చేపడతామని ప్రముఖ న్యాయవాది వంజాకుల లక్ష్మీనారాయణ హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కో-కన్వీనర్ రాజేష్ , లక్ష్మి , నవ్య , కృష్ణ , ఉదయ్ తదితరులు పాల్గొన్నారు .

20వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం

దేవరకొండ, నవంబర్ 20 (జనంసాక్షి):

దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని 20వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డులోని అర్హులైన కుటుంబాల వివరాలను సేకరించి, పథకంలో నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు జీవిత బీమా భద్రత కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నమోదు ప్రక్రియకు అవసరమైన వివరాలను అధికారులకు అందించాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



సూర్యాపేట (జనంసాక్షి):

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని 48వ వార్డులో 35 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వులను అందజేసి మాట్లాడారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకా లను చేపడుతుందని తెలిపారు.పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం,సన్న బియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీర్ల వాసు, సయ్యద్ సలీమ్, భరత్, డాక్టర్ యాదగిరి, మహేష్,నాగరాజు, బోనగిరి లక్ష్మణ్, వార్డు ఆఫీసర్ వీసారపు శ్రీనివాసరెడ్డి, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కుమారుడికి పునర్జన్మ ప్రసాదించిన తల్లి

కొడుకు కంటే ప్రాణం ముఖ్యం కాదని కన్న బిడ్డకు కిడ్నీ దానం చేసిన మాతృ ప్రేమ

కనగల్లు, నవంబర్ 20 (జనంసాక్షి)



కన్నబిడ్డకు జన్మనివ్వడమే కాదు.. ఆ బిడ్డ ప్రాణాలను కాపాడేందుకు తన ప్రాణాలను సైతం పణంగా పెట్టే తల్లి ప్రేమకు హద్దులు ఉండవని మండలంలోని దోరేపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బక్క ఎల్లమ్మ నిరూపించారు. కిడ్నీ వైఫల్యంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడు బక్క శంకర్‌కు స్వయంగా తన కిడ్నీని దానం చేసి మాతృప్రేమకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.బక్క ఎల్లమ్మకు ఐదుగురు కుమారులు. వారిలో రెండవ కుమారుడైన శంకర్ గత కొన్ని నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ కిడ్నీ మార్పిడి అవసరమైంది. దీంతో కుమారుడి ప్రాణాలను కాపాడేందుకు తల్లిగా తన కిడ్నీని దానం చేసేందుకు ముందుకొచ్చారు. వైద్యుల పర్యవేక్షణలో శస్త్రచికిత్స ద్వారా తన కిడ్నీని కుమారుడికి అందించారు. సాధారణంగా తల్లి బిడ్డకు జన్మనిస్తుంది.కానీ బక్క ఎల్లమ్మ తన కుమారుడికి మరోసారి పునర్జన్మని ప్రసాదించేందుకు చేసిన త్యాగమూర్తి విషయం విన్న ప్రతి ఒక్కరిని కదిలిస్తోంది.కన్నబిడ్డ కోసం తల్లి చూపిన త్యాగం,, తపన , ప్రేమను బంధువులు, గ్రామస్తులు, అభినందిస్తున్నారు జన్మనిచ్చిన తల్లికి బుక్కేడు అన్నంపెట్టడానికి ఆలోచించే ఈ రోజులలో ప్రాణాంతక అవయాలలో కిడ్నీని ప్రధానం చేసిన ఆ తల్లి హృదయాన్ని పలువురు అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



చౌటుప్పల్, నవంబర్ 20 (జనం సాక్షి)

చౌటుప్పల్ పట్టణ శివారులోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా షాహ్‌గంజ్‌లోని లబాంగ్ కాలనీకి చెందిన రోహిత్ రవి రట్టే (19) తన బంధువు పవన్ రట్టేతో కలిసి బొలెరో వాహనంలో ముంబై నుంచి విశాఖపట్నానికి ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లను తరలిస్తున్నాడు.తెల్లవారుజామున సుమారు 1:40 గంటల సమయంలో చౌటుప్పల్ దాటిన తర్వాత గంగోత్రి వాటర్ సర్వీసింగ్ సెంటర్ సమీపంలో విజయవాడ వైపు వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన అశోక్ లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ బొలెరో వాహనాన్ని కుడివైపు బలంగా ఢీకొట్టింది.ప్రమాద ధాటికి బొలెరో నడుపుతున్న రోహిత్ వాహనంలోంచి రోడ్డుపై పడిపోగా, ఆయిల్ ట్యాంకర్ అతని తలపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వాహనంలో ఉన్న పవన్ రట్టేకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నివాసి కందాడ కృష్ణ (37)గా గుర్తించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ పోలీసులు తెలిపారు.

ప్రతి కుటుంబానికి భరోసా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

సూర్యాపేట(జనంసాక్షి):



కుటుంబానికి ఆధారంగా నిలిచే వ్యక్తి అనుకోని ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని ఏఐసీసీ సభ్యులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అధ్యక్షతన నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కులమతాలు, ఆదాయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భరోసా కల్పించడం ఈ పథకం ప్రత్యేకత అని పేర్కొన్నారు.కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన సంపాదించే వ్యక్తిని బీమా కోసం ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు.కుటుంబ సభ్యులు తమకు నచ్చిన వారిని నామినీగా ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన వారు తమ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు వల్దాస్ లక్ష్మీ శ్రీనివాస్, నాగుల వాసు, భూక్య కౌశల్య, శ్రీవిద్య, కీర్తి లవన్, మాజీ కౌన్సిలర్ వల్దాస్ దేవేందర్, ఆలేటి మాణిక్యం, మున్సిపల్ అధికారులు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రత, చట్టాలపై సాజన్ పబ్లిక్ స్కూల్లో అవగాహన సదస్సు

చౌటుప్పల్ నవంబర్ 20(జనం సాక్షి)

మండలంలోని లక్కారం గ్రామంలో గల సాజన్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జస్ట్ రైట్స్, స్కోప్ ఎన్జీవో, షీ టీం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. బాలికల విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా (ట్రాఫికింగ్), డ్రగ్స్ దుష్ప్రభావాలు మరియు సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోక్సోచట్టం మరియు అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్రతి బాలికకు సమాన అవకాశాలు, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు సమాజం మొత్తం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం టోల్-ఫ్రీ నంబర్లతో కూడిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ హబ్ ప్రతినిధి భార్గవి, పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్, ఉపాధ్యాయ బృందం, షీ టీం ప్రతినిధి రవీందర్ రెడ్డి, షీ టీం సభ్యులు, స్కోప్ మండల కోఆర్డినేటర్ బి. నరసింహ రాజు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్లు దేశానికే ఆదర్శం

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు

కొండమల్లేపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి):

కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో కార్తీకమాస శుక్రవారం శుభ సందర్భంగా నిరుపేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరిందని కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం పేదలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని తెలిపారు. పేద కుటుంబాలు సొంత ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడం ఒక మంచి శుభ పరిణామమని అయన అభిప్రాయపడ్డారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బాలునాయక్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి రైతు బీమా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ శుక్రవారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు పంగ వెంకటమ్మ ఇద్దయ్య మాకు సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే బాలు నాయక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో లబ్ధిదారుడు ఇందిరమ్మ నూతన గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బోడ యాదయ్య యాదవ్, ఆదిరాల రాము, ఉప సర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, పంగ శివ, పంగ మహేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి

సూర్యాపేట(జనంసాక్షి):

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని 34వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు ఐదు లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు.మున్సిపాలిటీలో నిధుల కొరత ఉందని త్వరలోనే ముఖ్య నాయకులతో కలిసి వెళ్లి ముఖ్యమంత్రిని కలిసి నిధులు మంజూరు చేయవలసిందిగా కోరతామని అన్నారు. అన్ని వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫివుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు తాహెర్ బీన్ మన్సూర్, గుణగంటి హేమ సతీష్,నాయకులు కరుణాకర్ రెడ్డి,నరేందర్ నాయుడు, సాజీద్ నీడ్స్, అంజద్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభం

14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్

చౌటుప్పల్ నవంబర్ 20(జనం సాక్షి)



నిరుపేదల కుటుంబాలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆర్థిక ధీమా కల్పించేందుకే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రవేశపెట్టిందని 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కో-ఆప్షన్ సభ్యురాలు సందగళ్ళ విజయ సతీష్ గౌడ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ జ్యోతి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ నిరుపేద కుటుంబం వీధిన పడకుండా, వారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం (బీమా ప్రయోజనం) అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు. అర్హులైన వార్డు ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ డైరెక్టర్ వర్కాల రవి, వార్డు ఇంచార్జ్ బొంగు వెంకటేష్, ఊదరి స్వామినాథం, వార్డు ప్రజలు కామిశెట్టి చంద్రశేఖర్, వరగంటి శ్రీను, వరగంటి భాను, ఎస్.కె. మున్నా, చెరుకు రాజు, జిట్టగోని శ్రీను, తడకమళ్ళ శ్రీనివాస్ గుప్త, చెన్నగోని శివ గౌడ్, అప్పిడి శేఖర్ రెడ్డి, ఊడుగు నవీన్ కుమార్, జోగ్రీగల ఆంజనేయులు, కొయ్యల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి15 కోట్లతో నిధులు మంజూరు

పరి పాలన అనుమతులతో జీవో విడుదల సుందరీకరణతో మారనున్న ఆలయ ముఖచిత్రం





కనగల్లు, నవంబర్ 20 (జనంసాక్షి)

కోరిన వారికి బంగారమై , భక్తులు నిత్యం కొలిచే ఆరాధ్య దేవతగా విర జిల్లుతున్న ప్రసిద్ధ పుణ్యక్షేతం మం డలం లోని ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవాలయాన్ని అన్ని సౌకర్యాలతో సుందరీకరణ చేయడానికి రాష్ట్ర రోడ్డు భవనముల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సిఫారసుల మేరకు తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగము అధికారులు ఆలయం వద్ద సౌకర్యాలు కల్పన కు కావలసిన నిధులను అంచనాలు వేసి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. నివేదిక ఆధారంగా మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే 15 కోట్ల రూపాయల నిధులకు పరిపాలన అనుమతులను ఇప్పించి ఈనెల 19న జీవోను విడుదల చేయించ డానికి కృషి చేశారు. ఆలయం మరింత అభివృద్ధి లో భాగంగా సుందరీకరణ, పర్యాటక కేంద్రంగా ఆలయం ముఖచిత్రం మారుతున్నందున భక్తులు, ఆలయ పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

15 కోట్ల రూపాయల తో దేవాలయాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం. చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి

తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి 11 కిలోమీటర్ల సమీపంలో ఉన్న ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయానికి ప్రభుత్వం మంజూరు చేసిన 15 కోట్ల రూపాయలతో ఆలయాన్ని అన్ని రంగులతో సుందరీకరించి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర మంత్రికోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి ఆలయ కార్యనిర్వహణ అధికారి అంబటి నాగిరెడ్డి, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బందిసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



సీత పెద్దమ్మ మృతి బాధాకరం

మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన మాజీ ఎమ్మెల్యే

పి.ఏ.పల్లి,నవంబర్ 20(జనంసాక్షి):

పి.ఏ.పల్లి మండలం దుగ్యాల గ్రామానికి చెందిన సీత పెద్దమ్మ మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం దుగ్యాల గ్రామంలో సీత పెద్దమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ సీత పెద్దమ్మ మృతి తనను తీవ్రగ్రాన్ధంతికి గురిచేసిందన్నారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు.సీత పెద్దమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు యెల్గురి వల్లపు రెడ్డి,స్థానిక సర్పంచ్ ఆడెపు నగేష్,బిఆర్ఎస్ నాయకులు బొడ్డుపల్లి మహేందర్,రమావత్ దామోదర్,యాదగిరి, వెంకటయ్య,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి: సిఐటియు



దేవరకొండ, నవంబర్ 20(జనంసాక్షి)

నల్గొండ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికులకు భద్రత కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వాడపల్లి యాదగిరి, మున్సిపల్ కార్మికులు పొట్ట తారమ్మ, పొట్ట ముత్తమ్మ, అంకురి విజయ, వసుకుల వెంకటమ్మ, అంకురి మల్లమ్మ, చిత్రం మల్లమ్మ, సురేష్, అంకురి శ్రీకాంత్, అంకురి బిక్షపతి, ప్రశాంత్, అంకురి రాంబాబు, ఏసోబు, సందగళ్ల లక్ష్మయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస సాగుకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం

- నీటి వసతి ఉన్న రైతులకు రూ.14 వేల సాయం.. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి: పశువైద్యాధికారి మహేందర్ రెడ్డి



పి.ఏ.పల్లి,నవంబర్ 20(జనంసాక్షి):

పి.ఏ.పల్లి మండలంలోని పశుపోషక రైతులను ప్రోత్సహించడంతో పాటు పశువులకు ఏడాది పొడవునా పచ్చిమేత అందుబాటులో ఉండేలా ప్రభుత్వం పశుగ్రాస సాగుకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందని పి.ఏ.పల్లి మండల పశువైద్యాధికారి మహేందర్ రెడ్డి తెలిపారు.వి బి జి ఆర్ ఎం జి పథకం కింద భూమి,నీటి వసతి ఉన్న రైతులకు ఒక ఎకరం భూమిలో పశుగ్రాస సాగు కోసం రూ.14 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.ఈ పథకానికి అర్హులైన రైతులు పశు వైద్యశాల, గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఫీల్డ్ అసిస్టెంట్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు,జాబ్ కార్డు,భూమి పట్టాదారు పాస్ పుస్తకం,బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులతో పాటు గ్రామపంచాయతీ తీర్మానం జతచేయాలని తెలిపారు.పశుగ్రాస పంటల సాగుతో పశువులకు నాణ్యమైన పచ్చిమేత అందించడంతో పాటు మేత కొనుగోలు ఖర్చులను తగ్గించుకోవచ్చని అన్నారు.పాడి పరిశ్రమ అభివృద్ధికి పచ్చిమేత ఎంతో అవసరమని,ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని పశుపోషక రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మహేందర్ రెడ్డి కోరారు.

ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ఇందిరమ్మ

కుటుంబ జీవిత బీమా పథకం

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ : దొంతగాని శ్రీనివాస్ గౌడ్

హుజూర్ నగర్ టౌన్, నవంబర్ 20 (జనంసాక్షి):

పట్టణంలోని టౌన్ హాల్లో శుక్రవారం జరిగిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం రాష్ట్ర ప్రజలకు వరమని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుటుంబంలో సంపాదించే వ్యక్తి అకస్మాత్తుగా చనిపోతే ఆ కుటుంబ రోడ్డున పడకూడదనే లక్ష్యంతో ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ఆదాయంతో సంబంధం లేకుండా తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులేనన్నారు.

ఎలా నమోదు చేసుకోవాలి...?

2026 నవంబర్ 19 నుండి డిసెంబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. గ్రామపంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇంటింటికి వెళ్లి ధరఖాస్తులు స్వీకరిస్తారు.ఆ స్వీకరించిన ధరఖాస్తులను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు, పట్టణాలలో తహసీల్దార్ లకు అందజేస్తారు. నామినీ గా కుటుంబ సభ్యుల్లో ఎవరినైనా ఒకరిని నమోదు చేసుకోవచ్చు.రేషన్ కార్డ్ ఆధారంగా నమోదు చేస్తారు.రేషన్ కార్డు లేని వారికి కూడా అవకాశం కల్పిస్తారు.కుటుంబంలో ఒకరికి మాత్రమే జీవిత బీమా సౌకర్యం ఉంటుంది.ఈ పథకానికి అర్హత వయసు 18 నుండి 59 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 1967 నవంబర్ 19 నుండి 2008 నవంబర్ 18 మధ్య పుట్టిన వారు అర్హులు. నియోజకవర్గంలో అన్ని గ్రామ పంచాయతీల్లో నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఇందిరమ్మ బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు
- కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం..
- కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్ల ప్రాసీడింగ్స్ లబ్ధిదారులకు పంపిణీ..

చండూరు, నవంబర్ 20 (జనంసాక్షి)

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు ఆపద సమయంలో అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం చండూరు మున్సిపాలిటీలో ప్రారంభమైంది. శుక్రవారం చండూరులోని పీఆర్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, కమిషనర్ ఎల్. మల్లేశం, పాలకవర్గ సభ్యులు పాల్గొని పథకం వివరాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కుటుంబాన్ని పోషించే పెద్ద వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోకుండా ఆదుకోవడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ పథకం కింద బీమా పొందిన వ్యక్తి మరణిస్తే వారి నామినీకి రూ.5 లక్షల బీమా పరిహారం అందుతుందని వివరించారు. పేద కుటుంబాల ఆర్థిక భద్రతకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ పోషకులను ఈ పథకానికి అర్హులుగా పరిగణిస్తారని, వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారని తెలిపారు. బీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని, లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను నమోదు చేసుకునే అవకాశం ఉందని, వారికి అందాల్సిన బీమా మొత్తాన్ని వాటాల శాతాల ప్రకారం పేర్కొనవచ్చని వివరించారు.అర్హులైన కుటుంబాలు రేషన్ కార్డు, ఆధార్ కార్డు ప్రతులతో తమ వార్డుల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18, 2026 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇదే కార్యక్రమంలో చండూరు మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా చేయూత పింఛన్లు మంజూరైన అర్హులైన లబ్ధిదారులకు మంజూరు ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు



కార్యాలయం నుంచి తీసుకువచ్చిన పెన్షన్ మంజూరు పత్రాలను పీఆర్ గెస్ట్ హౌస్‌లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, కమిషనర్ ఎల్. మల్లేశం, పాలకవర్గ సభ్యులు లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు ఆర్థిక చేయూతనిస్తూ వారి జీవనానికి భరోసా కల్పిస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తెలుకుంట్ల రాజకుమారి, బుషిపాక వాసు, సామ సుజాత, జెల్ల ధనమ్మ, కొనైడ్డి మధు, కో-ఆప్షన్ సభ్యురాలు మొగుదాల సత్తమ్మ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, పట్టణ ప్రజలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవ సదస్సును జయప్రదం చేయండి

డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్20 (జనంసాక్షి)

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం రూపుదిద్దుకోవడానికి కారణం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమేనని, ఎన్ని ప్రభుత్వాలు మారిన పూర్తిస్థాయిలో రాజ్యాంగం అమలు కావడం లేదని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న, డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ... 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని, భారత రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలుపరిచేందుకు, రాజ్యాంగ హక్కులు కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను, భారత రాజ్యాంగాన్ని విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని వారిపై దేశద్రోహం కింద కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్



చేశారు. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 26న ఖమ్మం నగరంలోని ఐఎంఏ హాల్లో "భారత రాజ్యాంగ దినోత్సవ జిల్లా సదస్సును" ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్టిఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్, సంఘం వ్యవస్థాపకులు జన్ను కనకరాజు మాదిగ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుండి మేధావులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు దుప్పెల్లి శ్రీను మాదిగ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునగలేటి వీరస్వామి మాదిగ, ఖమ్మం నియోజకవర్గం ఇంచార్జి పిల్లిగుండ్ల ముత్తయ్య మాదిగ, పాలేరు నియోజకవర్గ ఇంచార్జి బొడ్డు గురువయ్య మాదిగ, ఖమ్మం కార్పొరేషన్ ఇంచార్జి రాయల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గ కో-ఇంచార్జి కొండా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అక్రమ ఇసుక రవాణాకు పోలీసుల అడ్డుకట్ట

✹ గోదావరి వంతెన కింద కందకాలు తవ్వించి రవాణా మార్గాలు మూసివేత

✹ ఎస్ ఐ మేడా ప్రసాద్

భద్రాచలం నవంబర్ 20 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక గోదావరి వంతెన దిగువ ప్రాంతంలో సాగుతున్న అక్రమ ఇసుక రవాణాకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. గోదావరి పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన సారపాక ఎస్ఐ మేడ ప్రసాద్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అక్రమ ఇసుక రవాణాకు వినియోగిస్తున్న మార్గాలను జేసీబీ సహాయంతో కందకాలు తవ్వించి మూసివేయించారు. వాహనాలు రాకపోకలు సాగించకుండా రహదారులను ధ్వంసం చేయడంతో అక్రమ రవాణాకు బ్రేక్ పడింది. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇసుక తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకేలా ఉండదా?

మునుగోడు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకునే ధైర్యం అధిష్టానానికి ఉందా?

బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకుల విషయంలో ఒక న్యాయం.. ఎమ్మెల్యేల విషయంలో మరో న్యాయమా?

మర్రిగూడ, నవంబర్20 (జనంసాక్షి)



కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ పేరుతో కొనసాగుతున్న చర్యలపై బీజేపీ సీనియర్ నాయకుడు వేనేపల్లి శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. సొంత పార్టీ నాయకులనే అవమానించే విధంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక నాయకుడిని పార్టీ నుంచి వెళ్లిపోవాలని బహిరంగంగా వ్యాఖ్యానించినంత మాత్రాన కాంగ్రెస్ అధిష్టానం మౌనంగా ఉండటమేమిటని నిలదీశారు. పార్టీ క్రమశిక్షణ అందరికీ సమానంగా వర్తించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నాయకులు చిన్నచిన్న విషయాల్లోనే పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే కారణంతో సస్పెన్షన్లకు గురవుతున్నారని, అదే అధికార పార్టీలోని ఎమ్మెల్యేల విషయంలో మాత్రం భిన్నమైన వైఖరి ఎందుకు అవలంబిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా క్రమశిక్షణపై చిత్తశుద్ధి ఉంటే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపైనా పార్టీ పరంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకరికి ఒక న్యాయం.. మరొకరికి మరో న్యాయం అనే ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని వేనేపల్లి శ్రీనివాసరావు అన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేయూత

చిలుకూరు, నవంబర్ 20 (జనంసాక్షి):

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న పాఠశాల అభ్యున్నతికి రూ.26 వేల విరాళాన్ని అందజేశారు.పాఠశాల గోడలపై విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేలా సైన్స్‌కు సంబంధించిన చిత్రాలు, తెలుగు ప్రముఖ రచయితల చిత్రాలు తదితర విద్యాపరమైన బొమ్మలను చిత్రించేందుకు ఈ మొత్తాన్ని కేటాయించారు. ఈ సందర్భంగా శుక్రవారం పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారాంకు రూ.26 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

ఉపాధి కూలీలకు ఇందిరమ్మ బీమా పథకంపై అవగాహన

రేషన్ కార్డు ఆధారంగా వివరాలు నమోదు చేసుకోవాలి

ఎంపీడీవో ధరావత్ సోంలాల్ ప్రజలకు పిలుపు

కామేపల్లి, నవంబరు 20 (జనంసాక్షి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా భద్రత లభిస్తుందని కామేపల్లి ఎంపీడీవో ధరావత్ సోంలాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తలింగాల గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతానికి ఆయన క్షేత్రస్థాయిలో వెళ్లి కూలీలతో మాట్లాడారు.ఈ సందర్భంగా పథకం ఉద్దేశాలను, ప్రయోజనాలను కూలీలకు విపులంగా వివరించి అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం తమ రేషన్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలతో పాటు,బీమా పొందే వ్యక్తి నామినీ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.ఈ అవకాశాన్ని గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బి. రమేష్ బాబు, ఉపాధి హామీ మేట్లు,పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు ప్రజలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్థాయికి మించి విమర్శలు చేయడం తగదు

మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి తాటిపాముల శేఖర్ గౌడ్

రామన్నపేట, నవంబర్ 20 (జనంసాక్షి):



జిల్లాతో పాటు రాష్ట్రస్థాయి సమస్యలపై పార్లమెంట్ లో గళం విప్పుతూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి గురించి బీఆర్ఎస్ నాయకులు స్థాయికి మించి ఆరోపణలు చేయడం తగదని డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు తాటిపాముల శేఖర్ గౌడ్ తెలిపారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ ఒక మునుగోడుకే పరిమితం కాదనే విషయం గుర్తుపెట్టుకోవాలని తెలిపారు.ఎంపీ స్థాయి నాయకులను విమర్శిస్తే పెద్ద లీడర్లు అవుతామని బీఆర్ఎస్ నాయకులు కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

ఉపాధి హామీ పథకంలో జిల్లాకో అంబుడ్స్‌పర్సన్ నియామకంపై బిజెపి హర్షం

చిలుకూరు, నవంబర్ 20(జనంసాక్షి):

గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో పారదర్శకతను పెంచేందుకు ప్రతి జిల్లాకు ఒక అంబుడ్స్‌పర్సన్‌ను నియమించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బిజెపి చిలుకూరు మండల అధ్యక్షులు పారెల్లి మహేష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. జాబ్ కార్డుల జారీ, వేతనాల చెల్లింపులో జాప్యం, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాల లేమి వంటి సమస్యలపై కూలీలు నేరుగా అంబుడ్స్‌పర్సన్‌కు ఫిర్యాదు చేసే వెసులుబాటు కలగడం వల్ల గ్రామీణ కూలీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇదే సమయంలో చిలుకూరు మండలంలోని ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. మండలంలోని ఒక గ్రామంలో జరిగిన అక్రమాలు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది వైఖరిపై ఒక కూలీ నేరుగా కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (అభీఆ) స్థాయి అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ, విచారణ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. విచారణను ఆలస్యం చేస్తూ రికార్డులను తారుమారు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇందుకోసం మధ్యవర్తుల ద్వారా డబ్బులు చేతులు మారుతున్నాయని పారెల్లి మహేష్ ఆరోపణలు చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్రం కొత్తగా ఏర్పాటు చేస్తున్న అంబుడ్స్‌పర్సన్ వ్యవస్థ ద్వారా ఫిర్యాదు చేయడంతో పాటు, మండలంలోని కూలీలను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పారెల్లి మహేష్ హెచ్చరించారు.

మోటకొండూరును నూతన శాసనసభ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి: తహసీల్దార్‌కు వినతి

మోటకొండూరు, నవంబర్ 20 (జనం సాక్షి):



తెలంగాణ రాష్ట్రంలో చేపట్టనున్న శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు మండల కేంద్రాన్ని నూతన శాసనసభ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరుతూ 'జాతీయవాది' పీసరి తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చుట్టుపక్కల ఉన్న అనేక మండలాలకు, గ్రామాలకు మోటకొండూరు ప్రధాన కేంద్రబిందువుగా ఉందని, రవాణా సౌకర్యాలు, భౌగోళిక పరిస్థితులు, జనాభా పరంగా ఇది అత్యంత కీలకమని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాన్ని నూతన నియోజకవర్గంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయవాదులు చిర్ర రవీందర్, తండా కృష్ణ గౌడ్, అనంతుల పాండురంగారెడ్డి, ఆలేటి నాగరాజు, బాల్ద నర్సింహులు, మల్ల అశోక్, రేగు మల్లేష్, భూమండ్ల మురళి, శనిగారం ప్రదీప్, జివిలికపల్లి శ్రీను, బొబ్బల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణ వర్ణంతో అలరించిన త్రివేణి

ఎరుపు రంగు దుస్తుల్లో మెరిసిన చిన్నారులు.. ఆటపాటలతో రెడ్ డే సందడి



ఖమ్మం, (జనంసాక్షి) :
చిన్నారుల్లో రంగుల పట్ల అవగాహన పెంపొందించి, వాటిని సులభంగా గుర్తించేలా చేయాలనే ఉద్దేశంతో ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం రెడ్ కలర్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులు ఎరుపు రంగు దుస్తులు ధరించి సందడి చేశారు. ఎరుపు రంగుకు సంబంధించిన ఆపిల్, స్ట్రాబెర్రీ, టమాటా, గులాబీ పువ్వు, రెడ్ కార్ వంటి వస్తువులను గుర్తిస్తూ వాటి గురించి తెలుసుకున్నారు. ఆటపాటలు, వివిధ కార్యకలాపాలతో వేడుకలు ఆనందంగా సాగాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, ఇలాంటి రంగుల వేడుకలు చిన్నారుల్లో పరిశీలనా శక్తిని, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు ఆటల ద్వారా నేర్చుకునే ఆసక్తిని కలిగిస్తాయని తెలిపారు. ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, పుస్తకాలకే పరిమితం కాకుండా ఇలాంటి ఆచరణాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఆనందదాయకమైన అభ్యసన అనుభవాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి. ఆర్. ఓ. కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకోవాలి

- శాంతినగర్‌లో ఎకరం మూడు గుంటల భూమిని కాపాడాలి

- తహశీల్దార్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్యవేదిక వినతి

భద్రాచలం నవంబర్ 20 (జనంసాక్షి)

భద్రాచలం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 111/5/1లో ఉన్న ఎకరం మూడు గుంటల ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ శుక్రవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకుడు, సామాజిక ఉద్యమకారుడు అలవాల రాజా మాదిగ మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వే బోర్డును తొలగించి, చెరువును పూడ్చివేస్తూ భూమిని చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి భూమి హద్దులను నిర్ధారించాలని, ఆక్రమణలకు అవకాశం లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోకపోతే పేదల తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

భద్రాద్రి రామయ్య ఆశీస్సులు దాతల కుటుంబాలపై ఉంటాయి

- దేవస్థానం ఆధ్వర్యంలో విరాళాలు అందించిన దాతలకు ఘన సత్కారం

భద్రాచలం నవంబర్ 20 (జనంసాక్షి)

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థాన అభివృద్ధికి, స్వామివారి నిత్య కైంకర్యాలకు విరాళాలు అందిస్తూ సేవలో భాగస్వాములవుతున్న దాతలను దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాతలకు ఆలయ మర్యాదలతో సన్మానం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈవో కె. దామోదర్‌రావు మాట్లాడుతూ భద్రాద్రి రామయ్యపై అపారమైన భక్తి విశ్వాసాలతో ఆలయానికి విరాళాలు అందిస్తున్న దాతల కుటుంబాలపై స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. భగవంతుడి సేవలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో దాతలు అందిస్తున్న ప్రతి విరాళం విలువైనదేనని పేర్కొన్నారు. విరాళం చిన్నదైనా, పెద్దదైనా దాని వెనుక ఉన్న భక్తిభావం, సేవాతత్పరత ఎంతో గొప్పవని కొనియాడారు. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్య కొలువైన ఈ పవిత్ర పుణ్యక్షేత్ర అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఆలయంలో నిత్య కైంకర్యాల నిర్వహణతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దాతల విరాళాలు ఎంతగానో దోహదపడుతున్నాయని చెప్పారు. దాతలు అందించే సహకారం ఆలయ అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా, భావితరాలకు ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించే గొప్ప సేవగా నిలుస్తుందని అన్నారు. దాతల భక్తి, సేవాభావం మరింత మందికి స్ఫూర్తినిస్తాయని పేర్కొంటూ, స్వామివారి సేవకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ దేవస్థానం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెల్లం శరత్ హత్యకు నిరసనగా నేడు భద్రాద్రి బంద్

ఆదివాసీ యువకుడి మృతికి న్యాయం చేయాలి..

ఆదివాసీ సంఘాల పిలుపు

భద్రాచలం నవంబర్ 20 (జనంసాక్షి)

ఆదివాసీ యువకుడు తెల్లం శరత్ హత్యకు నిరసనగా నేడు (శుక్రవారం) భద్రాద్రి బంద్‌కు ఆదివాసీ సంఘాలు పిలుపునిచ్చాయి. భద్రాచలంలోని శ్రీ సత్యసాయి రెసిడెన్సీ వద్ద జరిగిన దాడిలో అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన తెల్లం శరత్ మృతి చెందడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటన ఆదివాసీ సమాజంలో తీవ్ర ఆగ్రహావేశాలకు దారితీసింది. శరత్ హత్యకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరసనను బలంగా వినిపించేందుకు బంద్‌కు పిలుపునిచ్చారు. బంద్‌ను విజయవంతం చేసేందుకు ప్రజలు, వ్యాపారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సహకరించాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు.

చిన్నారులను ఆశీర్వదించిన ఎడ్ల మహేందర్ రెడ్డి

రామన్నపేట, నవంబర్ 20 (జనంసాక్షి):

మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన గంజి రామలింగం కుమారుడు, కూతుర్ల నూతన వస్త్రాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకకు మాజీ సర్పంచ్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల మహేందర్ రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి, ఠాకూర్ రమేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు ఆంజనేయస్వామికి భద్రాద్రి రామయ్య తరఫున ఆలయ మర్యాదలు

చందనోత్సవాన్ని పురస్కరించుకొని పట్టువస్త్రాలు, ప్రసాదం, సింధూరం సమర్పణ.

భద్రాచలం నవంబర్ 20 (జనంసాక్షి)

ప్రముఖ పుణ్యక్షేత్రాలైన భద్రాచలం, కొండగట్టు దేవస్థానాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధాన్ని చాటుతూ భద్రాద్రి రామయ్య తరఫున కొండగట్టు ఆంజనేయస్వామి వారికి ఆలయ మర్యాదలు సమర్పించారు. కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి చందనోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు భద్రాచలం దేవస్థానం అధికారులు, అర్చకులు కొండగట్టు క్షేత్రానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక ఆలయ మర్యాదలు అందజేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి సీతారామచంద్రస్వామి వారి తరఫున పట్టువస్త్రాలు, పవిత్ర ప్రసాదం, సింధూరం, తాంబూలాలు తదితర పూజా సామగ్రిని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాల మధ్య కొనసాగుతున్న ఈ సంప్రదాయం ఆలయాల ఆధ్యాత్మిక సంబంధాలకు, పరస్పర గౌరవ మర్యాదలకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఏఈవో భవాని రామకృష్ణ, ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అర్చకులు సీతారాం భార్గవ, పురోహితులు రఘు పుంగవ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ పనులు నాణ్యతతో

సకాలంలో పూర్తి చేయాలి

- నీటిపారుదల శాఖ అధికారులకు సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఆదేశం.

భద్రాచలం నవంబర్ 20 (జనంసాక్షి)

వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నీటిపారుదల శాఖ క్షేత్రస్థాయి ఇంజనీర్లతో కలిసి భద్రాచలంలో నూతనంగా నిర్మిస్తున్న పుష్కర ఘాట్ల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. శ్రీ సీతారామచంద్రస్వామి కొలువైన భద్రాచలంలో జరిగే గోదావరి పుష్కరాలకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. పుష్కర స్నానాలు ఆచరించే భక్తులకు సరిపడా ఘాట్లు అందుబాటులో ఉండటంతో పాటు, స్నానాలు చేసేందుకు అనువైన సౌకర్యాలు కల్పించాలన్నారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి పుష్కరాల నాటికి ఘాట్లను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లాలో బాల్య వివాహాలపై అవగాహన



ఖమ్మం , నవంబర్ 20 (జనం సాక్షి)

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా ఖమ్మం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రం, మోమినన్ హైస్కూల్‌లో బాల్య వివాహ రహిత భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలల హక్కులు, బాలికల విద్య, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే 1098కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ సమ్రీన్, ప్రమీల, వాసంతి, కే. సతీష్, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ మెడికల్ కాలేజీలో పీజీ సీటు సాధించిన నునావత్ లక్ష్మీ ప్రవళిక

కామేపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి):

నునావత్ లక్ష్మీ ప్రవళిక ప్రతిష్టాత్మకమైన గాంధీ మెడికల్ కాలేజీలో పీజీ (ఎంఎస్ ఆర్థోపెడిక్స్)లో సీటు సాధించి ప్రతిభ చాటుకుంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ వైద్య కళాశాలగా పేరొందిన గాంధీ మెడికల్ కాలేజీలో సీటు సాధించడం పట్ల పలువురు బంజారా గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రవళిక తండ్రి నునావత్ వెంకన్న ప్రస్తుతం కామేపల్లి మండలం లోని ఏజెన్సీ ప్రాంతమైన నెమలిపురి తండా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గిరిజన ప్రాంతానికి చెందిన ప్రవళిక చిన్నప్పటి నుంచే వైద్య విద్యపై ఆసక్తి పెంచుకుని, పట్టుదలతో కష్టపడి పీజీ స్థాయిలో ఆర్థోపెడిక్స్ విభాగంలో సీటు సాధించింది.ఈ విజయానికి తన తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉందని ప్రవళిక తెలిపింది.ప్రవళిక సాధించిన విజయంపై బంజారా కాలనీవాసులు, తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి నునావత్ వెంకన్న వెల్లడించారు.

దేవరకొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్‌డీపీఓ

○సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తుపై సమీక్ష..

○ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశం

దేవరకొండ, నవంబర్ 20 (జనంసాక్షి):
దేవరకొండ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డీపీఓ) ఎం.వి. శ్రీనివాసరావు శుక్రవారం దేవరకొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, కేసు రికార్డులు, స్టేషన్ డైరీ, అరెస్ట్ రిజిస్టర్లు, ఇతర అధికారిక రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, కోర్టు వ్యవహారాలు, రికార్డుల నిర్వహణపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ, క్రమశిక్షణ, యూనిఫారం, పనితీరును పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో కేసుల వివరాలు, అరెస్టులు, ఛార్జిషీట్లకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లోని మౌలిక సదుపాయాలు, వాహనాలు, కంప్యూటర్ వ్యవస్థలు, మహిళా సహాయక డెస్క్, పరిసరాల పరిశుభ్రతను కూడా తనిఖీ చేశారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్‌డీపీఓ ఎం.వి. శ్రీనివాసరావు ఆదేశించారు.









విజయవంతంగా ముగిసిన గ్రంథాలయ మహోత్సవాలు

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 20 (జనం సాక్షి)
ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుడా చైర్మన్ పూవాళ్ళ దుర్గా ప్రసాద్, డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ డీసీసీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, ఏఎంసీ చైర్మన్ హనుమంతు రావు, కమర్తపు మురళి, రావూరి సాయిధబాబు, పుచ్చకాయల వీరభద్రం తదితరులు హాజరయ్యారు.సుడా చైర్మన్ పూవాళ్ళ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలను ఎంతో ఘనంగా, క్రమబద్ధంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రతి కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో, అందరినీ సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా నిర్వహించిన చైర్మన్ గారి కృషిని ప్రశంసించారు.డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువతలో పఠనాసక్తి పెంపొందించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేలా చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. వారం రోజుల పాటు అన్ని కార్యక్రమాలను ఎంతో చక్కగా నిర్వహించిన చైర్మన్, కార్యదర్శి మరియు సిబ్బందిని అభినందించారు.అనంతరం వారోత్సవాల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డాన్స్, యోగా తదితర పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా గారు మాట్లాడుతూ, 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, పాఠశాలల యాజమాన్యాలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్యదర్శి మరియు గ్రంథాలయ సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ, సహకారంతో జిల్లా గ్రంథాలయ సంస్థకు నూతన భవనం అందుబాటులోకి రానుండటం ఎంతో సంతోషకరమని× పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి, విద్యార్థులు మరియు నిరుద్యోగ యువతకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. వచ్చే సంవత్సరం 60వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో అందుబాటులోకి రానున్న నూతన గ్రంథాలయ భవనంలో మరింత ఘనంగా నిర్వహించుకుందామని ఆకాంక్షించారు. అందరి సహకారంతో ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ సి.హెచ్. మాలసూరు, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, ఇతర సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా నమోదు కార్యక్రమానికి శ్రీకారం

బీమా పథకం నమోదు కోసం పంచాయతీ కార్యాలయాలకు చేరుకుంటున్న ప్రజలు.. నమోదు ప్రక్రియకు సహకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చంద్రుగొండ, నవంబర్ 20 (జనంసాక్షి):
చంద్రుగొండ మండలంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో ప్రజలు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు చేరుకుని తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ఈ పథకం అవశ్యకత, ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నమోదు ప్రక్రియలో ప్రజలకు సహకరిస్తున్నారు.శుక్రవారం చంద్రుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి సంబంధించిన నమోదులో భాగంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, చంద్రుగొండ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు తుమ్మలపల్లి సురేష్, కాంగ్రెస్ నాయకులు కేసబోయిన నరసింహారావు, సారేపల్లి శేఖర్, అంతటి రామకృష్ణ, ఇమ్రాన్ , వసీం పాషా, బుంగ శ్రీను, భాస్కర్ రావు, చాపలమడుగు లక్ష్మణ్, అన్వర్ తదితరులు పాల్గొని ప్రజలకు సహకారం అందించారు.

పేద కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి

-ప్రత్యేక నమోదు శిబిరాలను పరిశీలించిన తుంబూరు దయాకర్‌రెడ్డి

ఖమ్మం రూరల్,నవంబర్ 20(జనంసాక్షి):



పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఎంతో ప్రయోజనకరమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు.శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు గ్రామంతోపాటు ఏదులాపురం మున్సిపాలిటీ నాలుగో వార్డులో నిర్వహించిన ప్రత్యేక నమోదు శిబిరాలను ఆయన సందర్శించారు. నాలుగో వార్డులో చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డితో కలిసి లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఆరెకోడులో ప్రజలకు పథకంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి ప్రీమియం ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. నెల రోజులపాటు కొనసాగనున్న నమోదు ప్రక్రియలో అర్హులందరూ భాగస్వాములై ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు బోయిన కుమారి సంగయ్య,బానోత్ నాగేంద్రప్రసాద్,బానోత్ దివ్య, బుర్రా మహేష్, ఆరెకోడు కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గునిగంటి రమేష్, నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సిలివేరు బాబు, పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి కబడ్డీలో సెయింట్ జోసెఫ్ విద్యార్థుల ప్రతిభ..

ద్వితీయ స్థానం కైవసం

జిల్లా స్థాయి అండర్-17 బాలుర కబడ్డీలో నలుగురు

విద్యార్థులకు ఘనత.. అభినందించిన ప్రిన్సిపల్ సిస్టర్ లత

చంద్రుగొండ, నవంబర్ 20 (జనంసాక్షి):
జిల్లా స్థాయి అండర్-17 బాలుర కబడ్డీ పోటీల్లో చంద్రుగొండ సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. పాఠశాలకు చెందిన ఆకాష్ (9వ తరగతి), టీ. తనీష్, బి. జగన్, ఎం.డి. సమీర్ కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు.ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ లత అభినందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా పాఠశాలలో ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, సమష్టి భావన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, క్రీడల్లో చురుకుగా పాల్గొనే విద్యార్థులు చదువులోనూ మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త ఎం.డి. షాహిదా అఫ్రిది, వ్యాయామ ఉపాధ్యాయుడు పి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొని విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఎంఎస్ఎఫ్ రూరల్ మండల అధ్యక్షుడిగా మహంకాళి శశి

అధికార ప్రతినిధిగా రాయండ్ల విష్ణు ఎన్నిక



ఖమ్మం రూరల్, నవంబర్ 20(జనంసాక్షి)
ఎంఎస్ఎఫ్ ఖమ్మం రూరల్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహంకాళి వీరబాబు మాదిగ,ఎంఎస్పి మండల అధ్యక్షుడు సిరిపురపు బొందయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల ఎమ్మెస్ఎఫ్ అధ్యక్షుడిగా మహంకాళి శశి మాదిగ, అధికార ప్రతినిధిగా రాయండ్ల విష్ణు మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని నాయకులు సూచించారు. సమావేశంలో మండలంలోని మాదిగ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి పొదుపు పై అవగాహన కరపత్రాలను ఆవిష్కరించిన ఎంఈఓ

పెనుబల్లి, **నవంబర్ 20(జనంసాక్షి)** పెనుబల్లి మండలం టేకులపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు నీటి పొదుపు అవగాహన పై కరపత్రాలు ముద్రించి ప్రచారం చేశారు. సుమారు 20వేల కరపత్రాలను గ్రామాలలో పంచారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల సంరక్షణ నీటి పొదుపు అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కరపత్రాలను మండల విద్యాధికారి మోహన్ రావు ఆవిష్కారం చేశారు.ఎల్ నినో పరిస్థితులు దృష్ట్యా ప్రజలు నీటి వినియోగం పొదుపుపట్ల సరైన అవగాహనతో ఉంటే పరిస్థితులను అధిగమించవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు. పాఠశాల విద్యార్థుల చేత ప్రిన్సిపల్ టీవి రూపస్ జలప్రతిజ్ఞ చేయించారు .. ఈ కార్యక్రమానికి పాఠశాల సైన్సు ఉపాధ్యాయులు కందుల రవి,కంబాటి భిక్షపతి,తోరణి నాగేంద్ర, పర్యవేక్షించారు. పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు మాలోతు రాంప్రసాద్, నాగమణి రాంబాబు మార్గ నిర్దేశం చేశారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత : ఎం ఎల్ ఏ రాగమయి

రూ.5 లక్షల జీవిత బీమా పథకం ప్రభుత్వ సంక్షేమ దృక్పథానికి నిదర్శనం

పెనుబల్లి, నవంబర్ 20(జనంసాక్షి)

ఇందిరమ్మ కుటుంబ రూ.5 లక్షల జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతను కలిపిస్తుందని సత్తుపల్లి ఎంఎల్ఏ శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం పెనుబల్లి మండలం బయన్న గూడెం గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ రూ.5 లక్షల కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశ పెట్టడం అభినందనీయం అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని ఓ గొప్ప పథకం అని ఆమె అన్నారు,ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ప్రజా ప్రభుత్వ సంక్షేమ దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనుకోని ప్రమాదాలు, కుటుంబ సభ్యుల మరణం వంటి విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన



ఉద్దేశమని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భాల్లో ఆ కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఇందిరమ్మ కుటుంబ బీమా నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాగమయి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొంతు సత్యవతి, ఎం పి డి ఓ వీరస్వామి, తహసీల్దార్ వీరభద్ర నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుపంది వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, మహిళ నాయకురాళ్లు బుక్కా కృష్ణవేణి, నల్లమోతు సునీల, గూడూరు మాధవరెడ్డి, సత్తుపల్లి యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాధ్,మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మాళోత్ రాధాకృష్ణ, దొంతు మాధవ, వి ఎం బంజర్ సర్పంచ్ భూక్య ప్రసాద్ కుప్పెనగుంట్ల సర్పంచ్ నారుమళ్ళ వెంకటేశ్వరరావు, బొర్రా కోటేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్ కుమార్, మల్లెల రాజా, గోదాచన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువను పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

○రైతు పత్తి చేనులో పైతాన్ కొండచిలువ కలకలం

○మన్యప్రాణిని కాపాడిన ఫారెస్ట్ సిబ్బంది

చింతకాని , నవంబర్ 20 (జనంసాక్షి)

చింతకాని మండల పరిధిలో నేరడ గ్రామంలో కిలారి బాబు అనే రైతు పొలంలో పత్తి కూలీలు పత్తి తీస్తుండగా భారీ పైతాన్ కొండచిలువ కలకలం లేపింది. దీంతో భయభ్రాంతులకు గురైన పత్తి కూలీలు ఒక్కసారిగా కేకలు వేసి పొలం బయటకి వెళ్ళిపోయారు. గ్రామ సర్పంచ్ కి సమాచారం ఇవ్వడంతో సర్పంచ్ దూసరి.నేతాజీ,



పంచాయతీ కార్యదర్శి బంధం అర్జున్ ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ అధికారులు రంగంలో దిగారు. పైతాన్ కొండచిలువను శాఖ సక్యంగా పట్టుకున్నారు. ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు సిబ్బంది మాయ మస్తాన్ నులు మాట్లాడుతూ పైతాన్ కొండచిలువ సుమారు 15 అడుగులు పొడవు ఉంటుందని బరువు 70 కేజీలు ఉండొచ్చని అంచనా వేశారు. ఈ పైతాన్ ను సురక్షితంగా పట్టుకోవడంతో కూలీలతో పాటు గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకెన నాగేశ్వరావు గ్రామ ఉప సర్పంచ్ కోట బాలేష్ చెవుల తిరుపతిరావు గ్రామపంచాయతీ సిబ్బంది కనకపూడి శంకర్రావు గుజ్జర్ల శంకర్రావు ఫారెస్ట్ అధికారులకు సహకరించారు..

యువత ని విస్మరిస్తే దేశం వినాశనమే

○బీజేపీ పాసిస్ట్ పాలన వలన దేశంలో అబద్రతా భావం పెరిగింది

○ పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్

టేకులపల్లి, నవంబర్ 20(జనంసాక్షి):

పాలకులు యువతను విస్మరిస్తే దేశం వినాశనమేనని, భారత దేశ రాజకీయలలో యువత ప్రధాన పాత్ర పోశించాలని, ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్, రాష్ట్ర నాయకులు వాంకుడోత్ మోతిలాల్, మండల కార్యదర్శి తోటకూరి సతీష్ కుమార్ యువత కు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రగతిశీల యువజన సంఘం(పి వై ఎల్) టేకులపల్లి మండలం మహాసభ పూనెం సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహా సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూదేశంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిందని, నిరుద్యోగ సమస్యని పరిష్కారం చేయడంలో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయిందని, ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి,విమానయనం ను అంబానీ,ఆదాని లకు కట్టబెట్టిందని, త్వరలో రైల్వేని కూడా ప్రయివేట్పరం చేయబోతున్నారని, దేశభక్తి ముసుగులో యువతని ప్రభుత్వమే పెడదారి పట్టిస్తున్నారని, యువత ఉద్యోగాలు లేక ఉపాధి కోసం విదేశాలకు వలస పోతున్నారని, గ్రామాలలో డ్రగ్స్, గంజాయి, మత్తు పద్దర్థాలకు యువత బానిసగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో పి వై ఎల్ మండల నాయకులు పూణెం సమ్మయ్య,డేగటి లాలు, భూక్యా లక్ష్మణ్, గుగులోత్ సాగర్, భూక్య కిషన్, కల్తీ రాము, రావూరి ఉపేందర్, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్య హర్ష, భూక్య నర్సింగ్, భానోత్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకురూ.60వేల విలువగల డ్యూయల్ డెస్క్ లు వితరణ

పెనుబల్లి నవంబర్ 20 (జనంసాక్షి)

పెనుబల్లి మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సింగరేణి డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో శుక్రవారం లింగగూడెం ప్రాథమిక పాఠశాలకు రూ,60,000 లు



విలువ గల డ్యూయల్ డెస్క్ లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కావేటి మోహన్ రావు డెస్క్ లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్దం రత్నకుమారి, జడ్పీ హెచ్ ఎస్ లింగగూడెం కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పబ్బతి రమేష్,ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వై . శ్రీనివాస్, హనుమంతు, ఎన్ హెచ్ ప్రసాద్, లింగగూడెంప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పుల శ్రీనివాసరావు, సహోపాధ్యాయులు నాగుల రాజేష్ , ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుఎస్ పుల్లారావు,డి శ్రీని,టి రమేష్ పాల్గొన్నారు.

మధిర ప్రభుత్వం ఆసుపత్రిలో
నలుగురు వైద్యుల సస్పెన్షన్

విధుల పట్ల నిర్లక్ష్యం, సమయపాలన పాటించకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు

జిల్లా కేంద్ర ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్

ఖమ్మం,మధిర, నవంబర్ 20 (జనంసాక్షి) :

విధుల పట్ల నిర్లక్ష్యం వహించి, సమయపాలన పాటించని మధిర ఏరియా ఆసుపత్రికి చెందిన నలుగురు వైద్యులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కేంద్ర ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న మధిర ఏరియా ఆసుపత్రిలో జిల్లా కేంద్ర ఆసుపత్రుల సూపరింటెండెంట్ నిర్వహించిన సమావేశంలో వైద్యులు, సిబ్బంది అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. అయినప్పటికీ, శుక్రవారం (20.11.2026) నాడు నిర్దేశిత సమయానికి విధులకు హాజరుకాకపోవడంతో ఆసుపత్రి కార్యకలాపాలకు, ప్రజలకు అందాల్సిన వైద్య సేవలకు ఆటంకం కలిగే అవకాశం ఉన్నందున ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించామని తెలిపారు. మధిర ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఇచ్చిన నివేదిక మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసారం, తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనలు-1991 లోని రూల్ 8(1)(ఎ) కింద నలుగురు వైద్యులను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ



చేసినట్లు జిల్లా కేంద్ర ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ తెలిపారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో డిప్యూటీ సివిల్ సర్జన్ (జనరల్ మెడిసిన్) డాక్టర్ కె. అనిల్ కుమార్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (పిడియాట్రిక్స్) డాక్టర్ డి. శ్రీను, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (ఆర్థోపెడిక్స్) డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, మరియు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (రేడియాలజీ) డాక్టర్ పి. శ్రీకాంత్ ఉన్నారన్నారు.సస్పెన్షన్ కాలంలో వీరందరి హెడ్ క్వార్టర్స్ ఖమ్మంగా నిర్ణయించబడిందని, ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే, తమ వద్ద ఉన్న రికార్డులు, ఫైళ్లు, పరికరాలను మెడికల్ సూపరింటెండెంట్ సూచించిన అధికారికి అప్పగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని, వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కేంద్ర ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

పేద కుటుంబాలకు ఇందిరమ్మ బీమా కొండంత అండ

మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత

మధిర, నవంబర్ 20 (జనంసాక్షి):

నిరుపేద,మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భద్రతకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని తీసుకొచ్చిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పిలుపునిచ్చారు.శుక్రవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లెందులపాడు వార్డులో పథకం నమోదు ప్రక్రియను ఆమె లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మధిర నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పరితపించే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ, దార్శనికతతోనే ఈ బృహత్తర పథకం కార్యరూపం దాల్చిందని కొనియాడారు. ఇంట్లో దీపం వెలుగుతున్నంత సేపే సందడి ఉంటుందని, కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆ ఇంటికి కొండంత అండ అని తెలిపారు. ఆ పెద్దదిక్కుకు అనుకోని ఆపద వస్తే కుటుంబం రోడ్డున పడకూడదని, పిల్లల చదువులు ఆగకూడదన్న ఉన్నత ఆశయంతో భట్టి విక్రమార్క ఈ పథకానికి రూపకల్పన చేశారని ప్రశంసించారు.

ఒక్క పైసా భారం లేకుండానే జీవితకాల భద్రత

లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా, ఆ పూర్తి ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పిస్తోందని సుజాత స్పష్టం చేశారు. ప్రజలు కేవలం పది నిమిషాల సమయం కేటాయిస్తే కుటుంబానికి కొండంత భరోసా లభించే ఈ సువర్ణావకాశాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని కోరారు.డిప్యూటీ సీఎం ఆశయాలకు అనుగుణంగా మధిరలో 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న అర్హులందరూ పేర్లు నమోదు చేసుకోవాలని,ఏ ఒక్క కుటుంబం కూడా ఈ పథకానికి దూరం కాకూడదని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉదయ్ కుమార్,కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరావు, బానోతు రమణ నాయక్, శ్రీపాల శెట్టి వెంకటరావు, నగరికంటి రాజేశ్వరి, బోడపూడి రేవతి,బొల్లెద్దు విజయ్ కుమారి, షేక్



రసీదున్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు,జిల్లా నాయకులు మిరియాల వెంకటరమణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం..

తల్లీబిడ్డ క్షేమం

మధిర, నవంబర్ 20 (జనంసాక్షి) :108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో అంబులెన్స్‌లోనే ప్రసవం సురక్షితంగా జరిగింది. మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన ఎస్కే షమీనా (31) రెండో కాన్పు నిమిత్తం గత రాత్రి పురిటి నొప్పులతో మధిర ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు ఆమెను 108 అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో బోనకల్ మండలం జానకీపురం సమీపంలో ఈఎంటీ కళ్యాణి చాకచక్యంగా అంబులెన్స్ లోనే ప్రసవం చేయించారు. షమీనా మగబిడ్డకు జన్మనివ్వగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం ఈఎంటీ కళ్యాణి, పైలట్ రవీంద్రబాబు తల్లీబిడ్డను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి సురక్షిత ప్రసవానికి సహకరించిన 108 సిబ్బందికి బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



పల్టీ కొట్టిన ట్రాక్టర్- డ్రైవర్ దుర్మరణం

టేకులపల్లి, నవంబర్ 20(జనంసాక్షి):



అదుపుతప్పి ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం టేకులపల్లి మండలంలో చోటు చేసుకుంది.దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధిలోనిగంగారం పంచాయతీ లోని చర్లపల్లికి చెందిన కోరం మధు(27) అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా ట్రాక్టర్ తోలకానికి వెళ్లాడు. సంపత్ నగర్ నుంచి టేకులపల్లి వైపు వెళ్తున్న క్రమంలో అదుపు తప్పిన ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ట్రాక్టర్ ఇంజన్ మధుపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.సమాచారం తెలుసుకున్న బోడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు బోడు ఎస్సై రాజమౌళి తెలిపారు. మృతుడికి భార్య ప్రస్తుతం గర్భిణీతో ఉండగా, ఐదేళ్ల బాలిక ఉన్నారు. వీరితోపాటు వృద్ధాప్యపు తల్లిదండ్రులు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న కుటుంబానికి ఆసరాగా ఉన్న యువకుడు అకాల మృత్యువాతకు గురవడంతో భార్య, తల్లిదండ్రులు కన్నీరు మున్నిరవుతున్నారు. ఆ కుటుంబంలో జరిగిన విషాదంతో చర్లపల్లి గ్రామంలో విషాద ఛాయలను ముకున్నాయి. స్థానిక సర్పంచ్ తో పాటు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం ఉమా సురేందర్ దంపతులు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బోనకల్ కళాశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం

బోనకల్, నవంబర్ 20 (జనం సాక్షి):

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బోనకల్‌లో ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో బాల, బాలికల విద్యార్థులు కోసం వ్యక్తిగత పరిశుభ్రత మరియు యుక్తవయస్సులో కలిగే శారీరక, మానసిక మార్పులపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.



ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ జిడ్డీ. జోనతాన్ బాబు అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు వేముల స్రవంతి వడ్డెబోయిన కావ్యముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ వేముల స్రవంతి మాట్లాడుతూ, యుక్తవయస్సు అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమైన దశ అని, ఈ దశలో బాలబాలికలలో అనేక శారీరక, మానసిక, హార్మోన్ల మార్పులు చోటుచేసుకుంటాయని వివరించారు. ఈ మార్పులను సహజంగా స్వీకరించాలని, ఎలాంటి అపోహలు, భయాలకు గురికాకూడదని సూచించారు.అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ప్రతిరోజూ శుభ్రంగా ఉండటం, పరిశుభ్రమైన దుస్తులు ధరించడం, పోషకాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను వివరించారు. బాలికలకు ప్రత్యేకంగా రుతుక్రమ సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, శానిటరీ ప్యాడ్ల వినియోగం, వాటిని నిర్ణీత సమయంలో మార్చుకోవడం, ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్యులను సంప్రదించడం గురించి వివరించారు.బాలురకు ప్రత్యేకంగా యుక్తవయస్సులో శారీరక మార్పులు, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు, మానసిక ఆరోగ్యం, పరస్పర గౌరవం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు తమ ఆరోగ్య సమస్యలను సంకోచం లేకుండా తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో లేదా వైద్యులతో చర్చించాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, యుక్తవయస్సులో వచ్చే మార్పుల పట్ల సరైన అవగాహన కలిగింది.కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంతోటి.తిరుపతి రావు, అధ్యాపకులు ఎ.రాజేంద్ర కుమార్, పి.లక్ష్మీకాంతం, డి.పద్మావతి, యస్ .రాజేంద్ర, టి.యశోద, కె.శాంతిప్రియ, లైబ్రరీ యన్ ఏ.మోహన్, యు డి సి మదర్ సాహెబ్, బి.బుజ్జమ్మ, యాత్ర.అరుణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కనే కొత్త సబ్ స్టేషన్..

పొలంలోకి వేలాడుతున్న తీగలు!

రెండేళ్లుగా పట్టించుకోని విద్యుత్ సిబ్బంది.. రైతు ఆవేదన

మాడుగులపల్లి నవంబర్ 20 (జనంసాక్షి):



మండలం లోని ఇసుకబాయి గూడెం గ్రామానికి చెందిన రైతు బిరెడ్డి గోపాల్ రెడ్డి వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు మనిషికి తగిలేంత కిందికి వేలాడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి గత రెండేళ్లుగా స్థానిక విద్యుత్ సిబ్బందికి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల వైర్ల కారణంగా వరి కోత యంత్రం దిగబడిపోవడంతో రూ.3 వేల డీజిల్ ఖర్చు చేసి బయటకు తీయాల్సి వచ్చిందని వాపోయారు. తన పొలం పక్కనే నూతన సబ్ స్టేషన్ నిర్మిస్తున్నా, ప్రమాదకరంగా ఉన్న తీగలను మాత్రం సరిచేయడం లేదని మండిపడ్డారు ఇప్పటికైనా మండల స్థాయి విద్యుత్ అధికారులు స్పందించి వైర్లను సరిచేయాలని కోరారు.

గ్యాంగుల పేరుతో ఎవరైనా హాల్‌చల్ చేస్తే కటిన చర్యలు :ఇన్స్ పెక్టర్ సాదిక్ పాషా

ఖమ్మం టౌన్ నవంబర్ (20) జనంసాక్షి:

చంటి బాయ్ పేరుతో కొందరు సోషల్ మీడియాలో హంగామా సృష్టిస్తున్న. వారి పై కేసులు నమోదు చేసి నట్లు.వన్ టౌన్ పోలీస్ ఇన్స్ పెక్టర్ సాదిక్. పాషా తెలిపారు చంటి.బాయ్. గాంగ్. పేరుతో గ్రూపులు ఏర్పడి సోషల్. మీడియాలో హల్ చల్ చేస్తు ప్రజలను భయభ్రాంతు లకు గురి చేసేలా పోస్టులు వీడియోలు పెడుతున్న నగరం లోని శుక్రవారం పేటకు చెందిన మహమ్మద్ వజిద్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని. తదుపరి చట్టపరమైన చర్యలు నిమిత్తం వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు తెలిపారు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని గ్యాంగుల పేరుతో హడావిడి చేయడం భయభ్రాంతు లకు గురి చేయడం బెదిరింపులకు పాల్పడటం శాంతిభద్రతలకువిఘాతం కల్పించే వారిని. తీవ్రంగా పరిగణిస్తూ పోలీసులు వారిని గుర్తించి చట్ట పరమైన. చర్యలు చేపడుతున్నట్లు. తెలిపారు సోషల్. మీడియాలో




గ్యాంగుల. పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వారిని. ఉపేక్షించేది లేదని ..కటి. న చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీఈఓ ఉత్తర్వులకే దిక్కులేదా.. ఉపాధ్యాయురాలి ఇష్టారాజ్యం!"

○డిప్యూటేషన్ నామాపురానికి.. విధులు వట్టిమర్తిలో!

○విధుల కేటాయింపును ఇష్టాను సారంగా మార్చుకున్నారా?

○ఉపాధ్యాయురాలి వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని గ్రామస్తుల డిమాండ్



మర్రిగూడ/ గట్టుప్పల్ నవంబర్ 20 (జనంసాక్షి)
ప్రభుత్వ ఉత్తర్వులకు విలువ లేదా? ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత లేదా? తమకు అనుకూలమైన చోటే విధులు నిర్వహిస్తామంటే విద్యాశాఖ నిబంధనలు ఏమవుతాయి? ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా చోటుచేసుకున్న ఓ ఉపాధ్యాయురాలి వ్యవహారం ఇప్పుడు ఈ ప్రశ్నలను తెరపైకి తెస్తోంది. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న బానోత్ అరుణను నామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 18న గట్టుప్పల్ పాఠశాల నుంచి ఆమెను విధుల నుంచి విడుదల చేసినట్లు తెలుస్తోంది. అయితే డీఈఓ ఆదేశాల ప్రకారం నామాపురం పాఠశాలలో చేరాల్సిన ఆమె అక్కడ విధుల్లో చేరకుండా చిట్యాల మండల పరిధిలోని వట్టిమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తనకు నచ్చిన పాఠశాలలోనే విధులా?


ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, సర్దుబాట్లు, డిప్యూటేషన్లకు నిర్దిష్టమైన నిబంధనలు ఉంటాయి. ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం విధుల్లో చేరడం ఉద్యోగుల బాధ్యత. అలాంటిది ఒక పాఠశాలకు డిప్యూటేషన్ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయురాలు మరో పాఠశాలలో విధులు నిర్వహించడం వెనుక ఉన్న అధికారిక కారణాలేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. నామాపురం పాఠశాలలో చేరకుండా వట్టిమర్తిలో చేరేందుకు అనుమతి ఎవరిచ్చారు? డీఈఓ ఉత్తర్వులను మార్చేలా కొత్త ఉత్తర్వులు ఏమైనా వచ్చాయా? లేక మౌఖిక ఆదేశాల ఆధారంగా విధుల మార్పు జరిగిందా? అన్నది తేలాల్సి ఉంది.

ఎంఈఓ వివరణతో మరింత చర్చ!

ఈ వ్యవహారంపై గట్టుప్పల్ మండల విద్యాధికారి అమృతాదేవిని వివరణ కోరగా.. బానోత్ అరుణను నామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపిస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు. అయితే డీఈఓ ఆదేశాలను లెక్కచేయకుండా చిట్యాల మండల పరిధిలోని వట్టిమర్తి పాఠశాలలో ఆమె విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. సంబంధిత మండల విద్యాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల పాత్రపైనా స్పష్టత రావాల్సి ఉంది.

విద్యాశాఖ అధికారులు ఏం తేలుస్తారు?

డీఈఓ ఉత్తర్వుల ప్రకారం నామాపురం పాఠశాలలో చేరాల్సిన ఉపాధ్యాయురాలు వట్టిమర్తిలో విధులు నిర్వహిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై జిల్లా విద్యాశాఖ అధికారి తక్షణమే విచారణ చేపట్టాలని నామాపురం గ్రామస్తులు కోరుతున్నారు. డిప్యూటేషన్ ఉత్తర్వులను ఉల్లంఘించారా? విధుల మార్పునకు అధికారిక అనుమతులు ఉన్నాయా?



అనుమతులు లేకుండానే మరో పాఠశాలలో విధుల్లో చేరారా? అనే అంశాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రభుత్వ ఉద్యోగంలో వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు తావులేకుండా అధికారిక ఉత్తర్వులు, నిబంధనలే ప్రామాణికంగా ఉండాలి. మరి ఈ వ్యవహారంలో డీఈఓ ఉత్తర్వులు ఎందుకు అమలుకాలేదు? ఉపాధ్యాయురాలు నామాపురంలో విధుల్లో చేరకపోవడానికి అసలు కారణమేంటి? ఈ ప్రశ్నలకు జిల్లా విద్యాశాఖ సమాధానం చెప్పాల్సి ఉంది.

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

డ్రగ్స్, గంజాయి, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి గౌస్ పాషా



చౌటుప్పల్ నవంబర్ 20(జనం సాక్షి)
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి గౌస్ పాషా మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి, సరైన లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగానికి గానీ, అక్రమ రవాణాకు గానీ పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇలాంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించి, విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని, ప్రభుత్వ మెనూను తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్, చౌటుప్పల్ సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్ భార్గవ్, జాయింట్ సెక్రటరీ మక్తాల నరసింహ, సభ్యుడు ఖయ్యూం పాషా, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలమోని శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు తడక మోహన్, జెల్లా రమేష్, డీఎల్ఎస్ఏ సభ్యుడు మహమ్మద్ పాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు



సూర్యాపేట (జనంసాక్షి): పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు.శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల చివరి రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. సెల్‌ఫోన్ సంస్కృతికి స్వస్తి పలికి పుస్తక పఠన సంస్కృతిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో పఠన గదుల ఏర్పాటుకు, పత్రికలు, మాస పత్రికల కొనుగోలుకు నిధులు కేటాయిస్తోందని తెలిపారు.నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రటరీ రామచంద్రనాయక్, మరో గ్రంథాలయ ఉద్యమం రాష్ట్ర కన్వీనర్ కస్తూరి ప్రభాకర్,లైబ్రేరియన్ రంగారావు,సిబ్బంది సృజన,నిర్మల, పావని లక్ష్మమ్మ,ఉమా, పితాటి ప్రమీల, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కరువు కాటుకు ప్రజలు, రైతులు బలికాకముందే ప్రభుత్వం మేల్కొనాలి

❑ప్రజలకు నీటి కోతలైతే.. పాలకులకు పూర్తి జీతాలా ఇదేనా ప్రజాస్వామ్యం

❑మిషన్ భగీరథ ఉన్నా క్షేత్రస్థాయిలో తాగునీటి కష్టాలు ఎందుకు

❑ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్



చౌటుప్పల్ నవంబర్ 20(జనం సాక్షి)
ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రాబోయే రోజుల్లో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తక్షణమే మేల్కొని ముందస్తు కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి,బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర పిఏసి సభ్యుడు డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ప్రశ్నలు సంధించారు.

కరువు వచ్చాక సమీక్షలు ఎందుకు

కరువు పరిస్థితులు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డాక సమీక్షలు నిర్వహించడం, రైతులు పంటలు నష్టపోయాక పరామర్శించడం కాకుండా, సమస్య రాకముందే పరిష్కార మార్గాలు చూపడమే నిజమైన ప్రజాపాలన అని ఆయన పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పిన మిషన్ భగీరథ పథకం ఉన్నప్పటికీ, అనేక గ్రామాలు, కాలనీల్లో ప్రజలు నీటి కోసం రోడ్లపైకి ఎందుకు రావాల్సి వస్తోందని నిలదీశారు. నీటి సరఫరా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.ప్రభుత్వానికి డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ సంధించిన ప్రధాన ప్రశ్నలు :నీటి నిల్వలపై సమీక్ష ఏది చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, భూగర్భ జలాల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించిందా నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల సరఫరా, బోర్ల మరమ్మతులు, పైప్‌లైన్ల నిర్వహణకు నిధులు కేటాయించిందా

రైతులకు భరోసా ఏది?:

ప్రాజెక్టులు, కాలువల ద్వారా సాగునీరు అందించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? నీటి కొరతతో పంటలు ఎండిపోతే నష్టపరిహారం అందించే విధానం ఏమిటి?

పాలకులకు జీతాల కోత ఎందుకుండకూడదు?: ప్రజలు పన్నులు, నీటి మరియు విద్యుత్ బిల్లులు ఒక్కరోజు ఆలస్యమైతే జరిమానాలు కడుతున్నారు. మరి కనీస తాగునీరు అందించడంలో విఫలమైనప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారుల జీతాల్లోనూ కోత విధించే విధానం ఎందుకు ఉండకూడదు? ప్రజలకు ఒక న్యాయం, పాలకులకు మరో న్యాయమా?

శాశ్వత పరిష్కారం చూపే వరకు పోరాటం:

ఓట్లు అడిగేటప్పుడు గుర్తుకొచ్చే ప్రజల కష్టాలు, గెలిచాక పాలకులకు ఎందుకు పట్టడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు తక్షణమే సమీక్ష నిర్వహించి తాగు, సాగునీటిపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ప్రజల సమస్యలను పట్టించుకోని పాలనను ప్రశ్నించడం తమ హక్కు అని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తమ పోరాటం ఆగదని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ? తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ హోదాలో డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

దివ్యాంగుల పింఛన్‌లో మాయాజాలం!

- నకిలీ సదరం సర్టిఫికెట్లతో అనర్హులకు ప్రభుత్వ సొమ్ము
- ఏదో ఒక సాకుతో అసలైన లబ్ధిదారులకు అన్యాయం
- డబ్బులిచ్చి పత్రాలు తెచ్చుకున్న వారికే పింఛన్లు అందుతున్నాయన్న ఆరోపణలు
- విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని మండల ప్రజల డిమాండ్

మాడుగులపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి):
ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందాల్సి ఉండగా, మాడుగులపల్లి మండలంలో కొందరు అక్రమార్కుల చేతివాటంతో అనర్హులకు ఆదాయ వనరులుగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ముఖ్యంగా ఆసరా పింఛన్లు, అందులోనూ దివ్యాంగుల (వికలాంగుల) పింఛన్ల మంజూరులో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే చర్చ మండల వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. నిజమైన అర్హులు పింఛన్ల కోసం ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతుంటే, అనర్హులు మాత్రం దబ్బులు వెదజల్లి నకిలీ ధ్రువపత్రాలతో దర్జాగా ప్రభుత్వ సొమ్మును పొందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



అసలైన లబ్ధిదారులకు సాకుల పేరుతో నిరాకరణ..
మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిజమైన దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు నేటికీ పింఛన్లు మంజూరు కాలేదు. అధికారులు ఏదో ఒక సాకు చెబుతూ తమ దరఖాస్తులను పక్కన పెడుతున్నారని, సాంకేతిక కారణాలు చూపిస్తూ పింఛన్లు నిలిపివేశారని అసలైన లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఎలాంటి వైకల్యం లేని కొందరు వ్యక్తులు దళారులను ఆశ్రయించి, డబ్బులు పెట్టి నకిలీ సదరం (ూంఅంఖీఇఓ) సర్టిఫికెట్లు సృష్టించుకుని పింఛన్లు పొందుతున్నారని బాధితులు వాపోతున్నారు.

క్షేత్రస్థాయి విచారణ ఏదీ?
పింఛన్ మంజూరు సమయంలో క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాల్సిన సంబంధిత అధికారులు కనీస పరిశీలన కూడా చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి లబ్ధిదారుల అర్హతలు, వైకల్య శాతం, ధ్రువపత్రాల నిజానిజాలను క్షుణ్ణంగా తనిఖీ చేయకుండానే పింఛన్లకు ఆమోదం తెలిపారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి ఈ వ్యవహారం వెనుక ఎవరి హస్తం ఉంది? నకిలీ సర్టిఫికెట్ల జారీ నుంచి పింఛన్ మంజూరు వరకు అధికారుల పర్యవేక్షణ ఎందుకు లోపించిందనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

పునఃపరిశీలన జరిపితే అసలు బండారం బయటకు!
మాడుగులపల్లి మండలంలో మంజూరైన దివ్యాంగుల పింఛన్లపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నిపుణులైన వైద్యుల బృందంతో సదరం సర్టిఫికెట్లను పునఃపరిశీలన (రీ-వెరిఫికేషన్) చేయించాలని మండల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సమగ్ర విచారణ చేపడితే నకిలీ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్న అక్రమార్కుల బండారం బయటపడుతుందని వారు పేర్కొంటున్నారు. తక్షణమే అనర్హుల పింఛన్లను రద్దు చేసి, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడటంతో పాటు అర్హులైన నిరుపేదలకు పింఛన్లు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

చౌటుప్పల్ నవంబర్ 20(జనంసాక్షి)
చౌటుప్పల్ మండలం, అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. 18 నుండి 59 సంవత్సరాల వయస్సు కలిగి, కుటుంబాన్ని పోషించే యజమానులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఆధార్ కార్డులో నమోదైన వయస్సు ఆధారంగా అర్హతను పరిగణిస్తామని, రేషన్ కార్డు ఉన్నా లేకపోయినా అర్హులేనని స్పష్టం చేశారు. అర్హులైన గ్రామ ప్రజలు తమ ఆధార్ కార్డు,కొత్త రేషన్ కార్డు (ఉన్నట్లయితే) జిరాక్స్ కాపీలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించి, డిసెంబర్ 20, 2026 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుగౌడ్, ఆశా వర్కర్ బొల్లు అండాలు, మహిళా సంఘం అధ్యక్షురాలు పెండం లక్ష్మి, కారోబార్ శివాజీ, పాలకవర్గ సభ్యులు, గ్రామ మహిళలు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకను ఎన్నుకోండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నల్లమాస శ్రీకాంత్ గౌడ్ విజ్ఞప్తి

బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు.. హామీల అమలులో విఫలమయ్యాయని ధ్వజం

భువనగిరి, నవంబర్ 20 (జనం సాక్షి)
ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించే గొంతుకను పట్టభద్రులు తమ ఓటుతో ఎన్నుకోవాలని నల్లగొండ?వరంగల్? ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నల్లమాస శ్రీకాంత్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరించడంలో విఫలమైందని, ప్రతిపక్ష బీఆర్ఎస్ సైతం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల పక్షాన నిలబడని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నాయని ప్రశ్నించారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఘటనలపై స్పందించకుండా, సంధ్య థియేటర్ ఘటన సమయంలో సినిమా చూస్తూ సందడి చేయడానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు.ఖమ్మం జిల్లాలో ఇళ్లు కోల్పోయిన బాధితుల సమస్యలతో పాటు కృష్ణా?గోదావరి జలాల వివాదం, ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్ల ఏర్పాటు వంటి అంశాలపై తెలంగాణ రక్షణ సేన పార్టీ పోరాటం చేస్తూ పరిష్కార దిశగా కృషి చేసిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్రోత్తం రెడ్డి ప్రజల సమస్యలపై అవగాహన లేని వ్యక్తి అని విమర్శిస్తూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటు, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతుండటం, విద్యావ్యవస్థ వ్యాపార ధోరణిలోకి వెళ్లడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని జైలు జీవితం గడిపానని, సామాన్య నిరుపేద కుటుంబం నుంచి వచ్చి కులవృత్తిపై ఆధారపడిన కుటుంబ నేపథ్యం కలిగిన తనకు పట్టభద్రులు అవకాశం కల్పించాలని కోరారు. ప్రజా సమస్యలపై పూర్తి అవగాహనతో, నిరంతరం అందుబాటులో ఉంటూ వారి గొంతుకగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారి ఆదేశాల మేరకు, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ శ్రీకాంత్ గౌడ్ గెలిచిన తర్వాత పట్టభద్రుల సంక్షేమం కోసం తాను చేపట్టబోయే కార్యక్రమాలను, నిరుద్యోగులు, విద్యావంతుల సమస్యల పరిష్కారానికి చేయబోయే కృషిని ఓటర్లకు వివరిస్తూ తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్ రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్లాట్లు ఇచ్చే వరకు కదిలేది లేదు!

700 సర్వే నంబర్‌లో నిరుపేదల గుడిసెలు.. లేఅవుట్ చేసి స్థలాలు కేటాయించాలి
సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ

భువనగిరి, నవంబర్ 20 (జనం సాక్షి)
ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించే వరకు 700 సర్వే నంబర్ భూమి నుంచి కదిలేది లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ స్పష్టం చేశారు. భువనగిరి పట్టణంలోని 700 సర్వే నంబర్‌లో ఇళ్ల స్థలాల కోసం నిరుపేదలు మళ్లీ గుడిసెలు ఏర్పాటు చేసుకుని ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ.. భువనగిరి పట్టణంలో అనేక మంది నిరుపేదలు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్నారని, కష్టపడి సంపాదించిన డబ్బులో ఎక్కువ భాగం అద్దెలకే ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2025 జూన్‌లో నిరుపేదలు గుడిసెలు వేసుకోగా, ఆర్డీఓ, తహసీల్దార్ అధికారులు సీపీఎం నాయకులు, గుడిసెల వాసులతో చర్చలు జరిపి నెల రోజుల్లో ప్లాట్లు చేసి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారుల హామీ మేరకు గుడిసెలు తొలగించినప్పటికీ, అనంతరం స్థలాల కేటాయింపుపై అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.గత ఏడాదిన్నర కాలంగా అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఈ నెల 17న సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 700 సర్వే నంబర్‌లో 107 మందికి పట్టా సర్టిఫికెట్లు ఉన్నవారితో పాటు ఇళ్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. నాలుగు రోజులుగా అక్కడే నివాసం ఉంటున్నామని, ఈ నెల 20న అధికారులు, పోలీసులు వచ్చి గుడిసెలు తొలగించాలని సూచించినప్పటికీ, గతంలో ఇచ్చిన హామీలు అమలు కానందున స్థలాలు కేటాయించే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.భూమిని చదును చేసి లేఅవుట్ రూపొందించి, అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ మాట్లాడుతూ, అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు విసుగు చెంది మరోసారి గుడిసెలు వేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూమిని లేఅవుట్ చేసి, క్రమబద్ధంగా ప్లాట్లు ఏర్పాటు చేసి ఇళ్లులేని నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు వోల్దాస్ అంజయ్య, నరాల నరసింహ, లక్ష్మయ్య, కొత్త లలిత, ఇక్కుర్తి కళావతి, తులసి, కన్యబోయిన అరుణ, కృష్ణవేణి, దేశపాక ఆంజనేయులు, అనిత, రేణుక, జి. మల్లేష్, గడ్డం రాజు, గుడ్ల మహేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు..

